సాక్షి
ఒడిశా

ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,02,737
బంగారం	44 గ్రాముల 200 మిల్లీ గ్రాములు
వెండి	5 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



మార్మోగిన పంచాక్షరి

- 8లో



టైలరింగ్‌తో మహిళలకు ఉపాధి

- 8లో

న్యూస్‌రీల్

ఖైదీలకు భగవద్గీత పంపిణీ



కారాగార శాఖ అధికారులతో ఇస్కాన్ ఆలయం ప్రతినిధుల బృందం

భువనేశ్వర్: స్థానిక ఝర్‌పడా జైలులోని ఖైదీలకు భగవద్గీత, జపమాల, ప్రసాదం శనివారం పంపిణీ చేశారు. గీతా పారాయణం ఖైదీల్లో మనశ్శాంతి పెంపొందించడంలో దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. పవిత్ర మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని కారాగార విభాగం డైరెక్టర్ జనరల్ మనోజ్ ఛబ్రా అనుమతితో ఇస్కాన్ ఆలయ సభ్యులు ఝర్‌పడా జైలులోని ఖైదీలకు గీతా పుస్తకాలు, జపమాలలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. జైలు శాఖ అధికారుల అనుమతితో 27 మంది ఇస్కాన్ ప్రతినిధులు శనివారం ఉదయం సుమారు 2 గంటల పాటు జైలు ఖైదీలకు ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ సత్య ప్రకాష్ స్వంయి, జైలర్ సంతోషిని దాస్ తదితరులు పాల్గొన్నారు.

నిజాలను బట్టబయలు చేస్తాం

● ప్రతిపక్ష నేత జయ నారాయణ మిశ్రా



జయ నారాయణ మిశ్రా

భువనేశ్వర్: రాష్ట్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నవ కిషోర్ దాస్ హత్య వెనుక నిజాలను శాసనసభలో బట్టబయలు చేస్తానని ప్రతిపక్ష నేత, భారతీయ జనతా పార్టీ సభ్యుడు జయ నారాయణ మిశ్రా పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక ఎన్నో మిస్టరీలు ముసుగు తొడుక్కుని ఉన్నాయన్నారు. హంతకుల వర్గానికి రక్షణ కల్పించి, అమాయకులను హంతకులుగా చిత్రీకరించడం జరుగుతోందని ఆరోపించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసు అధికారిపై దురుసుగా ప్రవర్తించి జయ నారాయణ మిశ్రా ప్రస్తుతం వివాదాస్పద పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని సభలో ప్రస్తావించినా చర్చకు సిద్ధమేనని తెలియజేశారు. నవ కిషోర్ దాస్ హత్య ఘటనపై మాట్లాడుతున్నందుకే తనపై కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా పోలీసు అధికారితో ఘర్షణ తర్వాత తన ఇంటి బయట జరుగుతున్న నిరసనలు కుట్రలో భాగమేనన్నారు. మంత్రి హత్య వెనుక ఉన్నవారి గురించి ప్రజలకు ఇప్పటికే ఒక అవగాహన ఉందన్నారు. ఈ కేసులో పలువురు ఉన్నత స్థాయి వ్యక్తుల ప్రమేయం ఉన్నందున సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి: ఎమ్మెల్యే శశి భూషణ్

జయ నారాయణ మిశ్రా వ్యాఖ్యలపై బీజేడీ ఎమ్మెల్యే శశి భూషణ్ బెహరా స్పందించారు. రాజకీయాల్లో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం అవసరమన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షం ఏం లేవనెత్తినా చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. గతంలో ఒడిశా అసెంబ్లీలో జరిగిన అన్ని సమస్యలను బిజూ జనతా దళ్ ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని గుర్తు చేశారు. తాజాగా ప్రతిపక్ష లేవనెత్తే వాదనలను అదే రీతిలో అసెంబ్లీలో ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 21వ తేదీ నుంచి బడ్జెటు సమావేశాలు ప్రారంభమవ్వనున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ప్రమాద స్థలంలో మరణించిన దొళాయి, గాయపడిన పూజారీలు

జయపురం: జయపురం సదర్ పోలీసుస్టేషన్ పరిధి అండాగుడ సమీప రొండాపల్లి గ్రామం వద్ద 26వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రొండాపల్లి సమీపంలో శీతల బండార్ వద్ద ఒక ట్రాలర్ బొరిగుమ్మ వైపు పార్కింగ్ చేసి ఉంది. గుప్తేశ్వర్‌లో గుప్తేశ్వర స్వామిని దర్శించుకొని జయపురం మీదుగా నవరంగపూర్‌కు అదే రోడ్డు మీదుగా రజనీ కాంత దొళాయి, హరిరాం పూజారీలు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. వీరు పార్క్ చేసిన ఉన్న ట్రాలర్‌ను ఢీకొట్టడంతో రజనీకాంత్ మరణించగా, హరిరాం దొళాయి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కొరాపుట్ సహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. మృతుడు రజనీకాంత దొళాయి మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

తస్మై న కారాయ నమఃశివాయ



జయపురం: పూజలు అందుకుంటున్న శివలింగం

మహా శివరాత్రి పురస్కరించుకొని రాష్ట్రంలోని ప్రధాన శైవపీఠాలు శివనామ స్మరణతో శనివారం మారుమోగాయి. వేకువ జాము నుంచి రాత్రి మహాదీపం దర్శనం వరకు భక్తులంతా ఉపవాసం, జాగారంతో పరమ శివుణ్ణి ధ్యానించారు. హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ ఆ దేవదేవుడిని మనస్సులో నింపుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



లింగరాజు ఆలయంలో బారులుతీరిన భక్తులు



భువనేశ్వర్: జాగర అలంకరణలో ధవళేశ్వరుడు



భువనేశ్వర్: రాష్ట్రానికి చెందిన సైకత శిల్పి మానస్ కుమార్ సాహు గోవా మిరామర్ బీచ్‌లో వేసిన సైకత శిల్పం



భువనేశ్వర్: లింగరాజు ఆలయం సింహద్వారం ఆవరణలో..



పర్లాకిమిడి: రాజవీధి పొడుగు కోవెలలో భక్తుల రద్దీ



మల్కన్‌గిరి: పూజలందుకుంటున్న మల్లికార్జునుడు



బరంపురం: నీలకంఠేశ్వర ఆలయంలో...



జయపురం: గుప్తేశ్వర్‌లో...



రాయగడ: దేవగిరీశ్వరుని దర్శనానికి వెళ్తున్న భక్తులు

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



వారపు సంత భవనాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముదులి



ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ముదులి తదితరులు

● రాయగడ ఎమ్మెల్యే ముదులి

రాయగడ: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి అన్నారు. జిల్లాలోని కెరడ పంచాయతీ వత్తాడ ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవంలో శనివారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధతో విద్య నేర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో ఉత్తమ సౌకర్యాలు కల్పిస్తోందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి అశోక్ కుమార్ సతపతి, హెచ్‌ఎం దీప్తి కుమారి జెన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం సదరు సమితి సందుబడి వద్ద రూ.20 లక్షలతో నిర్మించిన వారపు సంత భవనాలను ప్రారంభించారు. మరో రూ.40 లక్షలతో అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీడీవో లక్ష్మీనారాయణ సాబొతొ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం



దశవతారాల డాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక గుండిచాబడి ఆవరణలో స్మార్ట్ స్కూల్ వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెంచూరియన్ వర్సిటీ డీన్ అశోక్ మిశ్రా మాట్లాడుతూ.. స్మార్ట్ స్కూల్ అతి తక్కువ కాలంలోనే మంచిపేరుతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు బిచిత్రా నంద బెబర్తా, ప్రిన్స్ డాన్స్ గ్రూప్ డైరెక్టర్ (ఛత్రపూర్) టి.కృష్ణమోహన్ రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ స్వగతిక మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



బాలల నైతిక హక్కులపై నృత్య రూపకం

వ్యవసాయంతోనే నాగరికత ఆరంభం

● గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్



ప్రసంగిస్తున్న గవర్నర్ గణేషీ లాల్

భువనేశ్వర్: వ్యవసాయంతోనే మానవ నాగరికత ప్రయాణం ఆరంభమైందని రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ అన్నారు. స్థానిక బరముండా గ్రౌండ్‌లో కృషి ఒడిశా కార్యక్రమం ముగింపు ఉత్సవంలో ముఖ్య అతిథిగా శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమొ కృషఏఐ యాప్‌ని ఆవిష్కరించారు. ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలతో పాటు, 40కు పైబడిన వ్యవసాయ రుణాల వివరాలు ఈ యాప్‌లో లభ్యమవుతాయని తెలియజేశారు. 5టీ కార్యక్రమం కింద ప్రవేశపెట్టిన అత్యాధునిక కృత్రిమ మేధాశక్తి యాప్‌గా పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది రైతులకు అవసరమైన సత్వర సమాచారం వెంటనే దొరుకుతుందని వెల్లడించారు. త్వరలో ఈ యాప్‌లో సౌకర్యాలను మరింతగా మెరుగుపరచనున్నట్లు విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరవింద కుమార్ పాఢి తెలిపారు.



అమొ కృషఏఐ యాప్‌ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ గణేషీ లాల్ తదితరులు

309 కిలోల గంజాయి పట్టివేత



11 బస్తాల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి



7 బస్తాల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి

బరంపురం: గంజాం, కొందమాల్ జిల్లాల పోలీసు అధికారులు శుక్ర, శనివారాల్లో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న రెండు వేర్వేరు వాహనాలపై దాడులు నిర్వహించి 309 కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఏఎస్పీ ఠాగుర్ ప్రసాద్ పాత్రో తెలిపిన వివరాల మేరకు.. శనివారం దిగపండి నుంచి బరంపురం వైపు వస్తున్న ఒక టాటా వ్యాన్‌లో అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచారం అందుకున్న సురడా పోలీసులు హింజికాట్–దిగపండి, బరంపురం మధ్య మూడురోడ్ల జంక్షన్‌లో కాపు కాశారు. దిగపండి నుంచి బరంపురం నగరంలోకి వస్తున్న సమయంలో ఫస్ట్‌గేట్ దగ్గర ఉన్న రామకృష్ణ పెట్రోల్ బంకు దగ్గర అధికారులు దాడులు నిర్వహించి 11 బస్తాల్లో 250 కిలోల గంజాయితో పాటు వాహనం స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కొందమాల్ జిల్లా పిరింగియా పోలీసు అధికారులు బంజనగర్ వైపు వస్తున్న ఒక ప్రైవేట్ బస్సులో దాడులు నిర్వహించి 7 బస్తాల్లో 59 కిలోల గంజాయిని సీజ్ చేశారు. అయితే ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచే తైక్వాండో పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో ఆదివారం 12వ జిల్లాస్థాయి సబ్‌జూనియర్స్, కేడిట్, జూనియర్స్ తదితర విభాగాల్లో తైక్వాండో చాంపియన్ షిప్–2023 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా ఉదయం 9.30 నుంచి మొదలుకానున్నాయి. ఈ పోటీల ప్రారంభోత్సవానికి మాజీ డిప్యూటీ సీఎం, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను విజయవంతం చేయాలని తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కర్ కోరారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీఐ



నిందితుడిని చూపిస్తూ విలేకరులతో మాట్లాడుతున్న సీఐ పి. పైడియ్య

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి సొట్టవానిపేటలో శుక్రవారం జరిగిన హత్యకు సంబంధించి నిందితుడు కొలుసు రామారావును అరెస్ట్ చేసినట్లు ఆమదాలవలస సీఐ పి.పైడియ్య శనివారం విలేకరులకు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. నిందితుడు రామారావు తన భార్య సూర్యంపై మూడేళ్లుగా అనుమానం పెంచుకున్నాడు. నిత్యం గొడవపడేవాడు. అయితే ఆమె తన మాట వినడం లేదనే కోపంతో ఏకంగా చంపడానికి నిశ్చయించుకు న్నాడు. కుమార్తె కూడా తల్లి అక్రమ సంబంధానికి సహకరిస్తోందని భావించి వీరిద్దరినీ చంపాలని అనుకున్నాడు. అనుకున్నట్టుగానే వా లుపు కత్తిని సిద్ధం చేసుకున్నాడు. ఇద్దరు కొడు కులు తమ పనులపై బయటకు వెళ్లిపోయాక భార్యపై దాడికి తెగబడ్డాడు. ఈ ప్రయత్నంలో ఆమెకు కుడిచేయి, ఎడమచేతికి గాయాలయ్యాయి. ఆమెపై దాడి చేస్తుండగా కుమార్తె విజయ అడ్డు పడడంతో ఆమెపై కూడా దాడి చేయడంతో చనిపోయిందని సీఐ తెలిపారు. నిందితుడు హత్య చేసిన తర్వాత మెట్టక్కివలస–2 వీఆర్‌ఓ కె. శ్రీనివాసరావు వద్దకు వెళ్లి లొంగినట్లు తెలిపారు. వీఆర్‌ఓ నిందితుడిని పోలీసులకు అప్పగించగా, అతడిని అరెస్ట్ చేసి హత్య చేసిన కత్తిని స్వాధీనం చేసుకొని కోర్టు లో హాజరు పరిచారు. ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి, రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో హెచ్‌సీలు గోవిందరావు, అప్పారావు, కృష్ణారావులతోపాటు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

నవధాన్యాల సాగు.. నేలతల్లి బాగు



ఎందువలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: నవధాన్యాలైన మినుములు, పెసలు, ఉలవలు, జొన్న, తోటకూర, కట్టె, కండి, ఊదలు, రాగులు సాగు చేసుకుంటే భూతల్లి సారమవుతుందని సేంద్రియ ఎరువుల ట్రెయినింగ్ మాస్టర్ శివ అన్నారు. శనివారం ఆనందపురం, ఎందువ గ్రామాల్లో నవ ధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు మితిమీరి వాడటంతో భూమి సారం కోల్పోయి నాణ్యమైన పంటలను సాధించలేకపోతున్నామని చెప్పారు. వచ్చే ఖరీఫ్ సీజన్ ముందు రైతులు నవధాన్యాల సాగు చేసుకుంటే మెరుగైన లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వలస సెక్టార్ ట్రైనర్ రమణమ్మ, రాజేష్, రాజేశ్వరి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు హేమంత్ కుమార్, యుంగధర్ పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

లావేరు: మండలంలోని లావేటిపాలెం గ్రామానికి చెందిన ఇనపకుర్తి శ్రీధర్(25) తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా బీబీనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలుపట్టాలపై అనుమానాస్పదంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీధర్ పేపరు ప్లేట్లు తయారు చేసే మిషన్లు రిపేర్ చేయడం, అమ్మకాలు చేపట్టడం వంటి పనులు చేస్తున్నాడు. ఈ నెల 15న విజయవాడలో బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లాడు. అక్కడి నుంచి ఈ నెల 17న సాయంత్రం 5.40 గంటల సమయంలో తండ్రికి ఫోన్ చేసి పేపర్ ప్లేట్ మిషన్ పనిమీద హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పాడు. నల్గొండ, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉంటున్న లావేటిపాలెం గ్రామానికి చెందిన స్నేహితులకు సైతం ఫోన్ చేసి రాత్రి 7.30 గంటలకు వస్తున్నట్లు సమాచారం అందించాడు. రాత్రి 8 గంటలైనా శ్రీధర్ రాకపోవడంతో స్నేహితులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. వెంటనే విషయాన్ని శ్రీధర్ తండ్రి తిరుపతిరావు, సోదరుడు దొరబాబుకు తెలియజేయగా వారు ప్రయత్నించినా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. చార్జింగ్ అయిపోవడం గానీ, రైలుతో ఫోన్ పోవడం గానీ జరిగి ఉంటుందని భావించారు. శ్రీధర్ మృతదేహం బీబీనగర్ రైల్వే ట్రాక్‌పై ఉన్నట్లు శనివారం ఉదయం లావేరు పోలీస్ స్టేషన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో అంతా విషాదంలో మునిగిపోయారు.

మార్మోగిన పంచాక్షరి



పర్లాకిమిడి: సొండివీధిలో బాలుంకేశ్వర ఆలయం వద్ద భక్తులు

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శివాలయాలు పంచాక్షరి మంత్రంతో మార్మోగాయి. లయకారునికి పాలు, పెరుగు, తేనె, చందనం, నెయ్యి, పానకాల పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. శనివారం తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద ముక్కంటీశ్వరుని దర్శనానికి బారులు తీరారు. రోజంతా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఏకాహం భజనలు జరిగాయి. లింగోద్భవవేళలో రుద్రాభిషేకాలు, విశేషపూజలు చేశారు. వివిధ ఆలయాల్లో సహస్ర దీపాలంకరణ సేవల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛంద సంస్థలు భక్తుల సేవలో నిమగ్నమయ్యాయి.



బరంపురం: శివ లింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



రాయగడ: మల్లికార్జున స్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు



జయపురం: గాంధీ జంక్షన్ వద్దనున్న శివాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



మల్కన్‌గిరి: కొండపైకి ఎక్కుతున్న భక్తులు



రాయగడ: రామలింగేశ్వర ఆలయంలో సహస్ర లింగార్చన పూజలు



రాయగడ: దేవగిరి కొండపై భక్తుల సందడి



మల్కన్‌గిరి: దిగువ వీధిలో పూజలందుకుంటున్న ఉత్తరేశ్వరుడు



బరంపురం: గొళంతరలో శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న పూజారులు



జయపురం: గుప్తేశ్వర్‌లో పూజలందుకుంటున్న మహేశ్వరుడు



బరంపురం: గోంజులో పూజలందుకుంటున్న సోమేశ్వరుడు



రాయగడ: శిలారూపంలో ఉన్న దేవగిరీశ్వరుని దర్శనం...



పర్లాకిమిడి: ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

టైలరింగ్‌తో మహిళలకు ఉపాధి



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: టైలరింగ్‌తో మహిళలకు ఉపాధి లభిస్తుందని నాబార్డు జిల్లా ఉన్నతాధికారి ప్రతీక్ పండా తెలియజేశారు. స్థానిక యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో మహిళా కుట్టు పనుల శిక్షణా కేంద్రం ద్వారా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను శనివారం పంపిణీ చేశారు. 30 రోజుల పాటు 30 మంది గ్రామీణ మహిళలకు ఆర్.శెఠి శిక్షణా కేంద్రంలో శిక్షణ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి సునారాం సింగ్, యూనియన్ బ్యాంక్ మ్యానేజర్ టి.రాకేష్ పట్నాయిక్ (జాజిపూర్ బ్రాంచి) తదితరుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాబార్డు జిల్లా అధికారి ప్రతీక్ పండా

సంగీత పరికరాల శృతికర్తలు



- 50 ఏళ్లుగా సంగీత పరికరాలు తయారీ
- తంత్రీ, చర్మ వాయిద్యాల తయారీలో దాస్ బ్రదర్స్

ఇచ్ఛాపురం రూరల్/ఇచ్ఛాపురం:

అర్ధ శతాబ్ద కాలంగా ఆ వీధిలో స్వర ధార ప్రవహిస్తోంది. శ్రుతులను సరి చేస్తూ.. గతులను పలికిస్తూ రాగ వాహిని పరవళ్లు తొక్కుతోంది. సాధారణంగానే ఇచ్ఛాపురం అందంగా ఉంటుంది. స్వేచ్ఛావతి అమ్మవారిని కనులారా దర్శించుకున్నాక అలా రైల్వేస్టేషన్ దారిలో తిరుగాడాలి. మున్సిపాలిటీ ఆఫీసు వీధిలో తిరుగుతూ దాస్ బ్రదర్స్ సంగీత పరికరాల దుకాణం వైపు దృష్టి సారించాలి. జబ్బుపడి వచ్చిన వాయిద్యాలకు అక్కడ చికిత్స లభిస్తుంది. కొత్త పరికరాలు పురుడు పోసుకుంటూ ఉంటాయి. పాతవి కొత్త ఊపిరి అందుకుంటూ ఉంటాయి. ఇద్దరు విశ్రాంత ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ అంగడి వాయిద్యాలకు వైద్యం అందిస్తోంది.



అమ్మకాలకు సిద్ధం చేసిన వాయిద్యాలు

పట్టణంలోని కంచ్రవీధికి చెందిన కిరమణి దాస్ ఉత్కళాంధ్రలో పేరు సంపాదించిన సంగీత విద్వాంసులు. ఆయన వద్ద వందలాది మంది సంగీతాన్ని నేర్చుకున్నారు. ఆయనే స్వయంగా సంగీత పరికరాలు తయారు చేసేవారు. ఆయన వారసత్వాన్ని ఇద్దరు కుమారులు దుక్ శ్యామ్‌దాస్, దేవేంద్రదాస్‌లు నిలబెడుతున్నారు. వీరిద్దరూ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు. అయినా సంగీతం చూపిన దారిని విడిచి పెట్టలేదు. ఇంటి వద్దనే సంగీత పాఠాలు చెబుతూ, పరికరాల తయారీ, విక్రయం కూడా చేస్తున్నారు. ముర్ధంగి, మృదంగం, తబలా, మద్దిల, డోలక్, డోలు వంటి సంగీత వాయిద్యాలను తయారీ చేసేందుకు నాణ్యమైన టేకు, గుమ్మడి, పనస కర్రలను వినియోగిస్తుంటారు. అన్నింటి కంటే ప్రధానంగా హార్మోనియం తయారీలో వీరిది అందె వేసిన చేయి. ముఖ్యంగా సింగిల్ రీడ్ హార్మోనియం, డబుల్ రీడ్ హార్మోనియం, త్రిపుల్ రీడ్ హార్మోనియం, లెగ్ హార్మోనియం, మౌత్ హార్మోనియం, రీడ్ వెర్టికల్ బో ర్డ్స్ తదితర రకాలు చేస్తారు.



మద్దిలిని తయారీ చేస్తున్న వర్కర్లు

సంగీతంపై మక్కువతోనే..



మా నాన్న సంగీత విద్వాంసులు, ఒరియా కవి. ఆయన వద్ద అప్పట్లో ఆంధ్రా, ఒడిశాకు చెందిన వందలాది మంది కళాకారులు సంగీతా న్ని నేర్చుకున్నారు. నేను, మా అన్నయ్య టీచర్లు గా పనిచేస్తూనే సంగీతం నేర్చుకున్నాం. సంగీత పరికరాల మరమ్మతులు, కొనుగోలుకు అప్పట్లో విశాఖ వెళ్లే వారు. అందుకే మేమే దుకాణం ఏర్పాటు చేశాం. సొంతంగా వర్క్‌షాప్ నిర్వహిస్తూ వాయిద్యాలను తయారు చేస్తున్నాం.

– దేవేంద్రదాస్, సంగీతం మాస్టార్, వర్క్‌షాప్ యజమాని

ప్రకృతి వ్యవ'సాయం'

- ప్రకృతి సేద్యంపై పెరుగుతున్న ఆసక్తి
- తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం
- ఆరోగ్యకర ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ

ఎచ్చెర్ల:

ప్రకృతి వ్యవసాయంపై అన్నదాతలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి, భూముల సారాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. దీంతో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం గత ఏడాది కంటే 984 ఎకరాలు పెరిగింది. ఈ సాగు వల్ల ఖర్చులు తగ్గడం, దిగుబడులు పెరగటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ఎచ్చెర్ల మండలంలోని 22 పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. గత ఏడాది 2926 ఎకరాల్లో ఈ పద్ధతిలో సేద్యం చేయగా.. ఈ ఏడాది ఆ విస్తీర్ణం 3,910 ఎకరాలకు పెరిగింది. స్వయం సహాయక సంఘాల్లోని సభ్య రైతులతో పాటు ఇతర రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారి స్తున్నారు. మండలంలో కేశవరావుపేట, ఫరీదుపేట, ఎస్ఎం పురం, ధర్మవరం, పొన్నాడ, తమ్మినాడుపేట, కొత్తపేట, కొంగరాం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. వీరంతా దాదాపు సన్న, చిన్నకారు రైతులే.

సహజ ఎరువులతో..

ఈ పద్ధతిలో సహజ ఎరువులనే వాడుతూ పంటలను సాగు చేస్తారు. జీడిమామిడి పూతలపై పురుగుల నివారణకు, పూత నిలవడానికి మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రావణాన్ని, ఎరువుగా వాడటానికి ఆవుపేడ, బెల్లం, పప్పు దినుసుల పిండి, తగినంత గోమూత్రాన్ని కలిపి మిశ్రమంగా తయారుచేసిన ఉండలను పంటలకు ఎరువుగా వాడుతున్నారు. అలాగే వీటికి నీటిని కలిపి తయారుచేసిన ద్రవ జీవామృతాన్ని పంటలపై చీడ, పీడల నివారణకు, పంట బలంగా ఎదిగేందుకు వినియోగిస్తున్నారు. అగ్గి తెగులు నివారణకు మారేడు కషాయం, వరిలో సుడిదోమ నివారణకు రేడియో మొక్కల ఆకులతో తయారుచేసిన కషాయం, వైరస్ నివారణకు పేడ కషాయం, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తూ పంటలను పండిస్తున్నారు. వీటిని కొందరు రైతులు స్వయంగా తయారు చేసుకుంటున్నారు. మరికొందరు ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటుచేసిన మినీ దుకాణాల ద్వారా కొనుగోలు చేసుకుని వ్యవసాయానికి వినియోగిస్తున్నారు.



ద్రవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు

క్లుప్తంగా

గడ్డివాములు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బొండపల్లి: మండలంలోని రాచకిండాం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు రైతులకు చెందిన రెండు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కోయ్యాన అప్పలనాయుడు, కోయ్యాన పోలీసుకు చెందిన గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. పొగ తాగి గడ్డివాములపై పడేయడంతో మంటలు వ్యాపించినట్లు తెలిసింది. గ్రామస్తులు అప్రమత్తమై మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో గజపతినగరంలోని అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలును అదుపు చేశారు. ప్రమాదంలో రూ.40 వేల వరకు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన మీసాల లక్ష్మునాయుడుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు శనివారం విలేకరులకు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఓ యువతిని తీసుకొని వెళ్లిపోయాడని ఎస్‌ఐ తెలిపారు. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: బాత్రూమ్‌లో ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బాదిపేటకు చెందిన మండా జ్యోత్స్న(30) ఈ నెల 16న తన భర్తను రైలెక్కించేందుకు వచ్చి ఇంటికి తిరిగిరాలేదు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే 17న మధ్యాహ్నం ఆమె తిరిగి ఇంటికి వచ్చింది. ఎక్కడకు వెళ్లావని అందరూ ప్రశ్నించడంతో ఆమె మనస్తాపం చెందింది. శనివారం మధ్యాహ్నం బాత్రూమ్‌కి వెళ్లింది. గదిలో ఉన్న కిటికీకి చున్నీతో ఉరి వేసుకుంది. ఎంతసేపటికీ తలుపు తీయకపోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులు వచ్చి చూసి, వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జ్యోత్స్న మృతి చెందింది. ఏఎస్‌ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్‌బీఐ ఏజీఎం కృష్ణమోహన్



మాట్లాడుతున్న ఏజీఎం కృష్ణమోహన్

తెర్లాం:

భారతీయ స్టేట్ బ్యాంక్ ద్వారా అందిస్తున్న సేవలను రైతులు,ఉద్యోగులు, వ్యాపారులు, డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ ఏజీఎం (అమరావతి) వి. కృష్ణమోహన్ అన్నారు. మండల కేంద్రంలోని పాతబస్టాండ్ ఆవరణలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ డి. మధుసూదన్ రావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'ఎస్‌బీఐ రాత్రి శివర్ ' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎస్‌బీఐ ద్వారా రైతులకు అనేక రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే డ్వాక్రా మహిళలు, వ్యాపారులు కూడా రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఎస్‌బీఐ తెర్లాం బ్రాంచ్ మేనేజర్ డి. మధుసూదన్‌రావు మాట్లాడుతూ, ప్రతి ఏటా కోట్లాది రూపాయల రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వెలుగు ఏపీఎం టి.రాము, బ్యాంక్ సిబ్బంది, రైతులు, ఉద్యోగులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు అండగా...

- పది పరీక్షల్లో మినహాయింపులు
- వైకల్యం ఆధారంగా పరీక్ష రాసేందుకు సహాయకుల అనుమతి
- మార్గదర్శకాలు జారీ చేసిన విద్యా శాఖ



బాదంగి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు బోధన

దివ్యాంగ విద్యార్థులు భవిష్యత్‌లో మరింత ఎదిగేందుకు విద్యాపరమైన మినహాయింపులు ఇస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పదో తరగతి పరీక్షల్లో రాసేందుకు సహాయకుల నియామకానికి సంబంధించి మరింత వెసులుబాటు కల్పించింది.

రామభద్రపురం: ప్రత్యేక అవసరాల గల వారికి విద్యనందించడంలో గత ప్రభుత్వాలు సమగ్ర విద్యా విధానాలు కల్పించడంలో విఫలమయ్యాయి. వీరి సర్వతోముఖాభివృద్ధికి చట్టాలు తెచ్చినా సంబంధిత శాఖల మధ్య సమన్వయం లేక అవి నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయి. వారు ఉన్నత చదువులు చదవలేక మధ్యలోనే ఆపేయడం, బడికి వెళ్లకపోవడం జరుగుతూ వచ్చింది. విద్యాహక్కు చట్టం ప్రకారం అందరూ చదవాలి. అయితే సాధారణ విద్యార్థులతో పాటు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను ఒకేలా చూడకుండా రెండేళ్ల క్రితం 10వ తరగతి చదువుతున్న ప్రత్యేక అవసరాల విద్యార్థులకు పరీక్షల్లో ఉత్తీర్ణత మార్కుల శాతాన్ని తగ్గించడంతో పాటు ప్రతి గంటకు 20 నిమిషాలు అదనపు సమయం ఇచ్చింది. అప్పట్లో కేవలం అంధత్వం, రెండు చేతులు పని చేయని వారికి మాత్రమే పరీక్షలు రాసేందుకు ప్రత్యేక సహాయకులను అనుమతి ఇచ్చింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి పాఠశాలల్లో ప్రత్యేక అవసరాల గల విద్యార్థులు పరీక్షల గండం నుంచి గట్టెక్కడానికి చేయూత అందించనుంది. ఒక్క మూగ, చెముడు తప్ప మిగిలిన అన్ని రకాల వైకల్యాలు గల విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు సహాయకులను అనుమతితో ప్రత్యేక సడలింపులు ఇస్తూ జీవో నెంబర్ 86 ప్రకారం మార్గదర్శకాలు జారీ చేసింది. 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాలను ప్రభుత్వం గుర్తించింది. ఇందులో లెప్రసి క్యూర్డ్, పర్మనెంట్ ఫిజికల్ ఎంపైర్మెంట్, స్పైనల్ కార్డ్ ఇంజురీ, అభ్యసనా సామర్థ్య లోపం, మానసిక వైకల్యం, ఆటిజం, మానసిక రుగ్మత, బహుళ వైకల్యం, హీమోఫిలియా, తలసేమియా, పికిల్ సెల్ ఎనీమియా, క్రానిక్ న్యూరాజికల్ కండిషన్స్, తదితర వైకల్యాలు గల విద్యార్థులకు సహాయకులను నియమించుకోవచ్చనని అనుమతి ఇచ్చింది. దీంతో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణతను సాధించాలన్న విద్యాచట్టం, సమగ్ర శిక్షా భియాన్ ఆశయాల సాధనకు మార్గం సుగమం అయిందని ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. శారీరక, మానసిక వైకల్యాల కారణంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలు అధికశాతం చదువు మధ్యలో మానేస్తున్నారు. తరగతులు పెరిగే కొద్ది బడి మానేసే వారి సంఖ్య ఎక్కువ అవుతోంది. ముఖ్యంగా తొమ్మిది, పది తరగతుల్లో వీరి సంఖ్య ఎక్కువగా ఉంటుందోన్న విషయం పలు సర్వేల్లో వెల్లడైంది. ఆసక్తి ఉన్నప్పటికీ ఉత్తీర్ణతకు అవసరమైన మార్కులను సాధించలేక మరికొందరు పదో తరగతి తర్వాత చదువులను కొనసాగించలేకపోతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 395 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. గతంలో ఆరు నుంచి ఇంటర్ వరకు చదువుతున్న అన్ని రకాల వైకల్యాలు ఉన్న విద్యార్థులకు 35 ఉన్న ఉత్తీర్ణత శాతాన్ని 20 శాతానికి సడలింపుతో పాటు ఫీజు మినహాయింపునిస్తూ గతంలో పలు జీవో నంబర్లుతో మార్గదర్శకాలు ఇచ్చిన ప్రభుత్వం ఎస్‌ఎస్‌ఏ విలీనవిద్య యంత్రాంగం, విద్యార్థుల తల్లిదండ్రులు చేసిన విజ్ఞప్తుల మేరకు పరీక్షల విధానంలో మినహాయింపులు ఇస్తూ పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేయడంతో ఆయా వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

మెరుగవుతున్న హాజరు శాతం



2016 దివ్యాంగుల చట్టం ప్రకారం ప్రభుత్వం గుర్తించిన 21 రకాల వైకల్యాలలో మూగ, చెముడు తప్ప మిగిలిన అన్ని వైకల్యాలు కలిగిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సహాయకులను నియామక అనుమతినిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాటు గతంలో ఇచ్చిన జీవోల ప్రకారం విద్యార్థులకు పరీక్షలు ఫీజు మినహాయింపు, ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గించడం వలన ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతంతో పాటు ఉత్తీర్ణత శాతం పెరుగుతుంది. అలాగే పిల్లల తల్లిదండ్రులకు ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుంది.

– లింగేశ్వరరెడ్డి, డీఈఓ, విజయనగరం

రాష్ట్ర పోటీలకు చెస్ జిల్లా జట్టు సిద్ధం



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్ – 19 చెస్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధమైంది. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహించిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 55 మంది క్రీడాకారులు హాజరుకాగా... అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కెవి.జ్వాలాముఖి తెలిపారు. ఎంపికైన వారిలో బాలుర విభాగంలో కాంద్రేగుల ప్రహ్లాద్, పవన్‌కుమార్, రూపేష్‌కుమార్, అక్కివరపు పరివేష్, బాలికల విభాగంలో కుందన ప్రియ, జాస్మిన్, సాయి జాహ్నా శ్రీ, రియాన్ ఉన్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు న్యాయ నిర్ణేతలుగా శ్రీనివాసరావు, ధనలక్ష్మితో పాటు జిల్లా అధ్యక్షుడు బిఎ. రావు పర్యవేక్షించారు.

కాశీ విశ్వేశ్వరుని సేవలో జెడ్పీ చైర్మన్



కాశీ విశ్వేశ్వరుని సన్నిధిలో మంత్రి అమర్‌నాథ్‌తో కలిసి పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కాశీ విశ్వేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రి గుడివాడ అమర్నాథ్‌తో కలిసి శనివారం అభిషేకాలు, పూజలు చేశారు. ప్రజలపై పరమేశ్వరుని కరుణా కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, మహా శివుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆ భగవంతుని ప్రార్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యడ్ల పైడిరాజు, గంట సతీష్, పీలకా శ్రీనివాసరెడ్డి, పైలా పెద్ద, అట్టాడ శ్రీను, పువ్వుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

విజయనగరం క్రైమ్: విధులు ముగించుకుని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పీవీఆర్ ఆస్పత్రి రోడ్డులో గాజుల రేగలో ఉన్న తన ఇంటికి సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిపై నలుగురు వ్యక్తులు దాడి చేసి అతని నుంచి పర్స్, నగదు కాజేసేందుకు సిద్ధపడ్డారు. అది అడ్డుకుందామనుకున్న మరొక వ్యక్తిపై దాడి చేసి, అతని వద్దనున్న డబ్బులు కాజేశారు. ఇదంతా చూస్తున్న మరికొందరు ఆ నలుగురిలో ఒకరిని సాగర్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. బాధితుని పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.వెంకటరావు తెలిపారు.

గజరాజుల బెంబేలు

- ఆకతాయిల కవ్వింపులతో..
- ఏనుగులు తిష్ట వేసిన చెరుకు తోటకు నిప్పు పెట్టిన ఆగంతకుడు
- భయంతో గజరాజుల పరుగులు
- మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది
- ఏడెకరాల్లో పంట నష్టం



కిమ్మి - నడుకూరు సమీపంలో ఉన్న ఏనుగులు

వీరఘట్టం: మండలంలోని నడుకూరు - కిమ్మి గ్రామాల మధ్య చెరుకు తోటలో తిష్ట వేసిన ఏనుగులు ఆకతాయిల కవ్వింపు చేష్టలతో బెంబేలెత్తిపోతున్నాయి. ఏనుగులు ఉన్న చెరుకు తోటకు కిమ్మి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నిప్పు పెట్టడంతో అగ్ని భయంతో ఏనుగులు పరుగులు పెడుతూ రోడ్డుపైకి వచ్చేశాయి. ట్రాకర్లు ఏనుగుల దారి మళ్లించడంతో కిమ్మి నుండి కొట్టుగుమ్మడ గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న మామిడి తోటలోకి చొరబడి సాయంత్రం వరకు అక్కడే తిష్ట వేశాయి. రాత్రికి ఏనుగులు వేరే ప్రాంతానికి తరలి వెళ్లొచ్చని అధికారులు అంచనా వేశారు. అయితే ఏడు ఏనుగుల గుంపులో హరి అనే ఏనుగు గుంపు నుండి తప్పిపోయింది. నడుకూరు, చిట్టపులివలస, జె.గోపాలపురం మీదుగా మూలలంక పరిసర ప్రాంతం వైపు ఒంటరి ఏనుగు వెళ్లినట్టు ఫారెస్టు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఏనుగులను చూసేందుకు పెద్ద సంఖ్యలో జనాలు కిమ్మి - నడుకూరు రోడ్డుపైకి రావడంతో రోడ్డంతా జనసందోహంగా మారింది. ఏనుగులు ఎటు నుండి ఎటువైపు వస్తాయో తెలియక ఫారెస్టు అధికారులు, పోలీసులు తలలు పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి నడుకూరు వద్ద జనాలను కంట్రోల్ చేస్తుండగా ఏనుగుపైకి ఓ గుర్తు తెలియని వ్యక్తి రాయి విసరడంతో ఆ రాయి పోలీసు హెడ్‌కానిస్టేబుల్ వాసుదేవరావు తగిలింది. చెప్పుకోలేని చోట రాయి తగలడంతో హెచ్‌సీ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉంది.

చెరుకు తోట దగ్ధం

ఏనుగులు ఉన్న చెరుకు తోటకు నిప్పు పెట్టటడంతో పంట వేసిన రైతులు కోడి తాతబాబు, వాసుదేవరావులకు చెందిన నాలుగెకరాల చెరుకు తోట పూర్తిగా కాలిపోయింది. కావాలనే తమ పొలానికి ఎవరో నిప్పు పెట్టారని రైతులు లబోదిబోమంటున్నారు. మరో రైతు రౌతు రామారావుకు చెందిన ఎకరన్నర మొక్కజొన్న పంటను ఏనుగులు ధ్వంసం చేశాయి. పాలకొండ రేంజర్ తవిటినాయుడు, సెక్షన్ ఆఫీసర్ హరికృష్ణ, డీఆర్‌ఓ రవిబాబుతో పాటు వీరఘట్టం పోలీసు సిబ్బంది ఏనుగులు ఉన్న ప్రాంతంలో జనాలను కంట్రోల్ చేస్తున్నారు.

సాహిత్య నిధి 'రా.ర.వే'

- ఎనిమిదేళ్లుగా నెలవారీ కార్యక్రమాలు
- వర్ధమాన సాహితీవేత్తలు, రచయితలకు అవకాశాలు – రెండు తెలుగు రాష్ట్రాల్లో పేరొందుతున్న రా.ర.వే.
- నేడు విస్మృత కళింగాంధ్ర సాహితీ సభ పుస్తకావిష్కరణ
- నేడు ఎనిమిదవ వార్షికోత్సవం



ఆవిష్కరించనున్న విస్మృత కళింగాంధ్ర సాహితీ ప్రభ పుస్తకం

రాజాం సిటీ: సమాజాభ్యుదయంలో సాహిత్యం పాత్ర ఎనలేనిది. ఇందుకు అవిశ్రాంతంగా రా.ర.వే (రాజాం రచయితల వేదిక) సభ్యులు కృషి చేస్తున్నారు. రాజాం రచయితల వేదిక ఓ సాహిత్య నిధిలా సాహితీ ప్రియులను అలరిస్తుంది. వర్ధమాన రచయితలను, కవులను పరిచయం చేస్తూ వారికి రచనా శైలికి దిక్సూచిగా నిలుస్తూ.. రాజాం పట్టణానికి ఖ్యాతినార్జించి పెడుతోంది. సాహిత్యం, సమాజం రెండు కళ్లు అనే మూల సూత్రంతో 2015 జనవరి 25న ప్రారంభించిన రాజాం రచయితల వేదిక ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. ముగ్గురి ఆలోచనలతో మొలకెత్తిన వేదిక పదిమందితో ప్రారంభమై మూడు పదులు దాటింది. ప్రతి నెల చివరి ఆదివారం ఒక సాహిత్య సమావేశం నిర్వహించుకుంటూ ఇప్పటి వరకు 96 సమావేశాలు పూర్తి చేసుకుంది. ఎనిమిదేళ్ల కాలంలో నన్నయ్య నుంచి నేటి వరకు అనేక మంది కవులు మీద, వారి రచనల మీద, వివిధ ప్రక్రియలపై, భాషా చరిత్ర, సాహిత్య చరిత్ర వంటి అనేక విషయాలపై సాహిత్య గోష్టి నిర్వహించారు. వేదిక సభ్యులు తమ రచనలతో ఇంతింతై వటుడింతై అన్న విధంగా మంచి కవులుగా, రచయితలుగా వెలుగొందుతున్నారు. తెలుగు భాష ఉనికి కోల్పోతుందన్న ఆవేదనతో ఈ వేదిక 'తెలుగుమాట – వెలుగుబాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.

నేడు ఎనిమిదవ వార్షికోత్సవం

స్థానిక ఒక ప్రైవేటు పాఠశాలలో రాజాం రచయితల వేదిక ఎనిమిదవ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నామని వేదిక నిర్వాహకులు గార రంగనాథం తెలిపారు. సమావేశంలో 'విస్మృత కళింగాంధ్ర సాహితీ సభ' అనే గ్రంథాన్ని సాహితీ రత్నాకర, సాహిత్య వాచస్పతి డాక్టర్ దామెర వెంకటసూర్యారావు ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు.

అదృశ్యమైన యువకుడి మృతి

- ఆదర్శనగర్ సమీపంలోని చెరువు ఒడ్డున మృతదేహం లభ్యం
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



తుప్పల్లో పడి ఉన్న వెంకటేష్ మృతదేహం

రాజాం సిటీ: స్థానిక మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన దేవులపల్లి వెంకటేష్ (25) మృతదేహం మున్సిపాల్టీ పరిధి ఆదర్శనగర్‌కు సమీపంలోని చెరువు ఒడ్డున కనిపించింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ వై.రవికిరణ్ తెలిపిన వివరాలు.. మృతుడు గత నెల 19న ఇంట్లో నుంచి వెళ్లిపోయి ఎప్పటికీ రాకపోవడంతో 23న అతని తండ్రి అప్పలస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పట్లో పోలీసులు యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఆదర్శనగర్, గోపాలపురం మధ్యలో చెరువు వద్ద కట్టెలకోసం వెళ్లిన కొంతమంది మహిళలు అక్కడ మృతదేహం ఉన్నట్లు శనివారం గుర్తించి స్థానికులకు తెలిపారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇన్‌చార్జి సీఐ హెచ్.ఉపేంద్ర సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గతంలో నమోదైన మిస్సింగ్ కేసులపై ఆరా తీసి దేవులపల్లి వెంకటేష్‌గా గుర్తించారు. చాలా రోజుల క్రితమే చనిపోయి ఉంటాడని తెలిపారు. తమ కుమారుడు మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు అప్పలస్వామి, పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మురిసిన రామతీర్థం

విజయనగరం జిల్లా రామతీర్థంలో శివరాత్రి సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఆలయం వద్ద అఖండ దీపాలంకరణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు అర్చకులు నిర్వహించారు. దేవాలయం విద్యుద్దీప కాంతుల నడుమ మెరిసిపోయింది. జాగారాలకు భక్తులు తరలివచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



విద్యుత్ కాంతుల నడుమ రామతీర్థం దేవాలయం



శివాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ఆలయ ప్రాంతంలో భక్తుల సందడి

ఆహా ఏమి రుచి..!

అమ్మ చేతివంట కమ్మదనమే వేరన్నట్టు... ఉంగరాడలో తయారయ్యే అప్పడాలు, నేతి వడియాల రుచి, శుచి కూడా అంతే. తరతరాలుగా సంప్రదాయ తయారీ విధానం అయిన.. చేతితోనే తయారు చేస్తున్నారు. అందుకేనేమో తరాలు మారుతున్నా.. రుచి ఏ మాత్రం తరగడం లేదు. నోట్లో వేసుకుంటే.. అదే రుచి, అదే కమ్మదనం! అంత నాణ్యంగా ఉండడం వల్లే ఏ యేటికాయేడు వినియోగదారులు పెరుగుతున్నారు.

'చేతి'అప్పడాలు.. నేతి వడియాలు ఉంగరాడ ప్రత్యేకత

- యంత్ర పరికరాలకు దూరంగా సంప్రదాయ పద్ధతిలో తయారీ
- ఒక్కో కుటుంబం ఏటా సగటున రూ.10 లక్షల వరకూ వ్యాపారం
- ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటుకు కలెక్టర్ ప్రతిపాదనలు



అప్పడాలను తయారుస్తున్న ఉంగరాడ మహిళలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాజాం నియోజకవర్గం పరిధిలోని ఉంగరాడ గ్రామంలో తయారవుతున్న అప్పడాలు కావాలంటే మాత్రం ముందుగా ఆర్డర్ ఇవ్వాల్సిందే. మార్కెట్లోకి చాలా కంపెనీల అప్పడాలు వస్తున్నా ఉంగరాడ గ్రామస్తులు చేయి తిరిగిన పనితనం ముందు అవి తేలిపోతున్నాయి. అక్కడ 40 కుటుంబాలకు ఆ అప్పడాల తయారీయే జీవనాధారం. పరోక్షంగా మరో 55 మందికి ఉపాధి లభిస్తోంది. ఒక్కో కుటుంబం ఏటా సగటున రూ.10 లక్షల వరకూ వ్యాపారం చేస్తున్నాయి. నువ్వుల అప్పడాలతో పాటు నేతి వడియాలు, చిన్న చిన్న వరిపిండి వడియాలు వంటివి కూడా ఇక్కడ తయారు చేస్తున్నారు. ఇందుకోసం సహజసిద్ధమైన ఆహార పదార్థాలను వినియోగించడం విశేషం. ఎలాంటి రసాయన పదార్థాలను కలపకపోయినా దీర్ఘకాలం నిల్వ ఉండడం ఉంగరాడ అప్పడాల ప్రత్యేకత.

ఒక్కో అప్పడం ధర రూపాయి

ఒక్కో అప్పడం తయారీకి 70 పైసల దాకా ఖర్చవుతుండగా, ఒక్కో అప్పడాన్ని రూపాయికి విక్రయిస్తున్నారు. అంటే ఒక్కోదానికి 30 పైసల దాకా లాభం వస్తుందన్నమాట. అలాగే నువ్వుల అప్పడం తయారీకి ఒక్కో దానికి రూ.1.50 పైసలు ఖర్చవుతుండగా.. ఒక్కో దానిని రూ.1.80కి విక్రయిస్తున్నారు. స్పెషల్ నువ్వుల అప్పడం ధర మాత్రం రూ.2.50.

ప్రభుత్వ ప్రోత్సాహం

ఉంగరాడ అప్పడాలు, వడియాలు ఉత్తరాంధ్రతో పాటు ఇతర జిల్లాలకూ ఎగుమతి అవుతున్నాయి. తయారీదారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఉంగరాడ ప్రాంతాన్ని ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయడానికి కలెక్టర్ ఎ.సూర్యకుమారి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇక్కడ అప్పడాల పరిశ్రమను మరింత అభివృద్ధి చేస్తే.. ఇతర ప్రాంతాల నుంచి మరింత మంది వ్యాపారులు కొనుగోలు చేసేందుకు వచ్చే అవకాశం ఉంది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉంగరాడలో అప్పడాల తయారీలో ఉన్న మహిళలకు అందించిన రుణాలు వారికెంతో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కూడా జగనన్న చేదోడు పథకం కింద వడ్డీలేని రుణాలు, వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ప్రత్యేక రుణాలను అందిస్తూ వారిని ప్రోత్సహిస్తోంది.

అప్పడాల తయారీయే ఆధారం



మాకు అప్పడాల తయారీతో నెలకు రూ.20 వేల వరకూ ఆదాయం వస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఇదే మాకు జీవనాధారం. వ్యాపారులు, గృహ వినియోగదారుల నుంచి వచ్చే ఆర్డర్ల మేరకు తయారు చేసి విక్రయిస్తున్నాం.

– వారణాశి లక్ష్మి, అప్పడాల తయారీదారు

వ్యాపారం విస్తరిస్తోంది...



మా ఉంగరాడ అప్పడాల వ్యాపారం విస్తరిస్తోంది. మన రాష్ట్రంలోనే గాకుండా తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇస్తే కొరియరు ద్వారా కూడా పంపిస్తున్నాం.

– వారణాశి వైకుంఠరావు, అప్పడాల వ్యాపారి

నాణ్యతలో రాజీ లేదు..



ఎన్నో ఏళ్లుగా అప్పడాల వ్యాపారం చేస్తున్నాం. ఎన్నాళ్లయినా ముడిసరుకుల కొనుగోలు, అప్పడాల తయారీలో ఏమాత్రం తేడా లేదు. నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదు. అందుకే ఉంగరాడ అప్పడాలకు అంత డిమాండ్.

– ఇప్పిలి తిరుమల, అప్పడాల తయారీదారు